


# హనుమంతుని స్వప్నము

రాముడు రాజసింహాసన మధిష్ఠించి అప్రతిహత ప్రతాపముతో రాజ్యశాసనమును, నిజ సంతానముకరణి ప్రజాపాలనమును జేయ నారంభించెను. కోసలరాజ్యము శాంతిస్వాస్థ్యములకు నిలయమయ్యెను. ధనధాన్యాదులతో ప్రజల యిండ్లు నిండిపోయినవి. తస్కరులు, వంచకులు, పండిత మూర్ఖులు దమతమవృత్తులు నాశనమగుటంజేసి దేశము వదలి పాఱిన వారైరి. న్యాయాలయములలో వాదిప్రతివాదులు లేరు. చెఱసాలలు నిర్మానుష్యమాయెను. వైద్యులు రోగులు లేకపోవుటచే భోగుల పరిచర్యకు నియుక్తులైరి. న్యాయాధిపతులు—తమ తీరిక సమయమున—ఒండొరులలో రంధ్రాన్వేషణము సేసికొనుచు, నందుననే వారు మహదానందము ననుభవింపుచుండిరి.

హనుమంతు డిపు డయోధ్యయందే నివసింపుచున్నాడు. రాము డితని కొఱ కొక సురమ్యకదళీకాననమున నేడంతరువుల కాష్ఠభవన మొకటి నిర్మింపజేసెను. మహావీరు డందులో నతి సుఖముగ వాసము సేయుచు భక్తజనుల ఆదరణమున సర్వాంగీణపరిపుష్టి నార్జించినవాడాయెను.

ఈ విధముగ గొన్నిమాసములు గడచిన పిమ్మట వారిలో మార్పు గోచరించినది. పవననందనుడు దినదినము కృశించిపోవుటయు, వారి కాంతి మ్లానమగుటయు, అయోధ్యావాసు లుద్విగ్నులై చూచిరి. రాముని యాజ్ఞచే వైద్యులు హనుమంతునికి చికిత్స సేయ నారంభించిరి. విస్తారముగ నరిష్టము, మోదకము, రసాయనాదులని నిచ్చిరి. కాని ఏ విధమైన ఉపకారము గానుపించలేదు. భిషక్కులు హతాశులై "మహావీరుని వ్యాధి యాధ్యాత్మికమైనది; ఔషధములకు లొంగదు" అని రామునకు విన్నవించిరి. ఇక గత్యంతరము లేక వశిష్ఠమహర్షి హనుమంతుని కుశలము కొఱకు గొప్ప యాగము సేయ దలపెట్టెను.

ఇచట రాణియగు సీత హనుమంతుని శుద్ధాంతఃపురమునకు బిలిపించి "వత్స! నీ కేమి సంభవించినది? చెప్పుము. నేను నీకు మాతృతుల్యను; చెప్పుటకు సంకోచింపవలదు," అని జిజ్ఞాసచేసెను.

మహావీరుడు కొంచెముతడవు తన వామగ్రీవ కండూయనము చేసి, పిమ్మట దక్షిణగ్రీవ కండూయనము చేసినవాడాయెను. తదనంతరము నతమస్తకుడై మందస్వరముతో, "తల్లీ! మీరు నాగుప్త విషయమును వినదలచిన నే నెటుల దాచగలను? కొన్నిదినముల క్రిందట నేను స్వప్నములో బితృదేవతలను జూచితిని. వారు సుమేరు శిఖరమున బంక్తిబద్ధులై కాళ్లు వ్రేలవైచుకొని కూర్చుండి, విషణ్ణ వదనములతో శూన్యోదరములను జేత నిమురుకొనుచుండిరి. ఈ దుఃస్వప్నమున కర్థమేమని నేను వశిష్ఠపుత్రుడైన వామదేవుని నడుగ వారు "మహావీర! విశేష మేమియు లేదు. నీ పితృదేవతలు క్షుధితులైయున్నారు. కదళీఫలములను దగ్ధముసేసి శ్రాద్ధము చేయుము. బ్రాహ్మణులకు భూరిదక్షిణయు"

పరశురాం

నిమ్మని చెప్పిరి. నేను వామదేవుని యుపదేశమును పాలించితిని. కాని తరువాత పితృదేవతలు స్వప్నములో మరల దర్శనమిచ్చిరి. ఈ తాత్కాలిక వ్యవస్థకు వారు తృప్తిపడరని నేనపుడు గ్రహించితిని. నేను మరణించిన పిమ్మట వారికి పిండోదకముల నెవ రొసగెదరు? సామాన్యముగ జనులు వివాహము చేసికొని గృహస్థధర్మము పాలించు ప్రాయమున నేను సుగ్రీవున కనుచరుడనయి వానప్రస్థములో గడపితిని. ఇపుడు ప్రభువైన శ్రీరామచంద్రుని కృపవలన సుగ్రీవున కతని రాజ్యము తిరిగి వచ్చినది; రావణుడు హతుడాయెను; నాకును దీరిక చిక్కినది. కాని నేనిపుడు వార్ధక్యద్వారమున ఉపస్థితుడనై యున్నాను. నే నిపుడు వివాహము చేసికొని గృహస్థుడను గాదలచిన లోకులు నన్ను ధిక్కారము చేసెదరు. అయ్యో! నేనీ పితౄణమునుండి యిప్పు డెటుల విముక్తుడను గాగలను? దేవీ! ఈ దుశ్చింతయే నన్ను ననవరతము దహింపుచున్న యది. నేను నిరంతరము పితృదేవతల మలిన వదనములను, శూన్యోదరములను జూచుచున్నాను. నా కాకలి యడుగంటినది; నిద్ర నీరసించినది" అని చెప్పి, హనుమంతు డశ్రువిమోచనముసేయ నారంభించెను.

హనుమంతుని వచనములు విని జానకీదేవి మందహాసముతో నిట్లనెను:

"వీరశ్రేష్ఠ! ఈ స్వల్పవిషయమునకు చింత యెందులకు? నీవు లోకనిందకు వెఱవవలదు. సత్వరము వివాహము సేసికొని పితృదేవతలను నిశ్చింతులను జేయుము. అయినను నీకు బ్రాయ మేమంత గడచినది? పూజ్యపాదులైన నా మామగారు నీకంటె నధికవయసున భరతజననిని గృహమునకు దోడ్కొనివచ్చిరి. నేను నా సఖులను బిలిపించెదను; వారొకరి కన్న నొకరు సురూపలు, సుశీలలు, సద్వంశీయలు. నీ కిచ్చవచ్చిన కన్యను బత్నిగా వరించుము. ఓ కపిప్రవర! నేను నిక్కముగ జెప్పుచున్నాను-ఈ యయోధ్యలో నిన్ను బతిగా గ్రహించు ధన్యురాలెవరో యని ఆతురత జెందని కన్య యుండదు. నీవు నీజాతికొఱకై లవలేశము సంశయింపవలదు. నా యనురోధముచే వశిష్ఠమహర్షి యుపనయన సంస్కారము సేసి నిన్ను క్షత్రియునిగ జేయగలడు. ఒకవేళ నీకు మానవియం దభిరుచి లేనిచో గిష్కింధకు బోయి పరమసుందరియగు వానరిని బాణిగ్రహణము సేసికొని సత్వరముగ నయోధ్యకు దిరిగిరమ్ము. నీ పత్నిపే రేదయినంగా నిమ్ము, నేను మాత్రము హనుమతి యనియే పిలిచెదను. ఈ రాజాంతఃపురాంగనలలో నామెను గూడ సాదరముగ జేర్చుకొందును."

అపుడు హనుమంతుడు ప్రఫుల్లితచిత్తుడై "జనకనందినీ, నీకు జయమగు గాక! నేను కులమర్యాద నతిక్రమించను; వానరినే వివాహమాడెదను, శ్రీరామచంద్రుని యనుమతిగొని నేడే కిష్కింధకు బయనమయ్యెదను" అని చెప్పి, బయలుదేరిన వాడాయెను.

అనేకములైన గిరి, నది, వనభూముల నతిక్రమించి హనుమంతుడు దండకారణ్యమునందు ప్రవేశించెను. ప్రొద్దు క్రుంకనుండెను. మహావీరు డొక విశాలమయిన శాల్మలీతరుశాఖపై గూర్చుండి, అలసట దీర్చుకొనుచు, సమీపమున నెక్కడనైన రాత్రివాసమున కుపయుక్తమగు నాశ్రయ మున్నదేమోయని నాలుగు దిక్కులు గలయజూచిన వాడాయెను. అనతిదూరమున నొక పర్ణశాల నయనగోచరమాయెను. హనుమంతుడు వృక్షము నవరోహించి యా పర్ణగృహమున బ్రవేశించెను. లోపల చక్కగ నలంకరింప బడియున్నది. భూమిమీద గోమల తృణరాశిపై మసృణమృగచర్మము పఱచియుండెను. ఒకమూల స్తూపీకృతసుపక్వామ్ర పనసరంభాదిఫలములు; రెండవమూలను చందనకాష్ఠ నిర్మితమంచపై రాజోచితవసనములు, ఉత్తరీయోష్ణీషప్రభృతి పరిచ్ఛేదములు; ఇంకను వివిధ ప్రసాదన ద్రవ్యములు; ప్రాచీర గాత్రమున వ్రేలాడు రమ్యమగు వీణ.

హనుమంతు డన్నియు గదలించి చూచి హర్షితచిత్తుడై "అహో! నిశ్చయముగ స్వర్గస్థపితరులు నా యందలి వాత్సల్యముచే నీ యుపహార సామగ్రిని బంపియుండవచ్చును. వారి ప్రీత్యర్థమే నే నిపుడీ పరిచ్ఛేదము ధరించి, చేపరి రాత్రికాలమున నీ యుపదేయ భోజ్య సామగ్రిని భక్షించెదను" అని, దలచి హనుమంతుడా విచిత్ర వసనోత్తరీయాదులు ధరించి, మస్తకమున నుష్ణీషము నిడి అతిశయ శోభాన్వితు డాయెను. తరువాత శయ్యపై నుపవేశనముచేసి ఇటుల భావించెను "ఇంకను వేళ యతిక్రమింపలేదు. భోజనమునకు వ్యవధి యున్నది. అంతదనుక నే నీ వీణను మ్రోయించి చూచెదను."

హనుమంతుడు సావధానుడై వీణను దించెను. కాని వాద్యమున కుపక్రమింపగనే వారి కఠినాంగుళిస్పర్శచే తంతువు లన్నియు దెగిపోయెను. హనుమంతుడు విరక్తుడై "మాదృశ వీరున కీ క్షణభంగుర యంత్రమస్పృశ్యము." అని వీణ నావలకు ద్రోసి, మృగచర్మముపై శయనించి, భావిభార్యను గుఱించి చింతనచేయ నారంభించెను.

"కాంత ఎటుల నుండవలయును? తన్వియా? స్థూలయా? పింగళ వర్ణయా, రక్తకపిశప్రభయా? ధీరయా? చపలయా? కలకంఠియా, లేక కర్కశస్వనయా?——" ఇటుల జింతన జేయుచుండ వారిచిత్తమున నాకస్మికముగ నిర్వేదము గలిగెను. అంతట హనుమంతు డూహాపథమున విహరింపసాగెను: "అహో! నేనెట్టి ఘోరకర్మమున కొడిగట్టనుంటి! నేను సాగరము లంఘించితిని; లంకను దగ్ధముచేసితిని; గంధమాదనము పెకలించితిని; సాగరాంబర పర్వతారణ్యములలో నా కజ్ఞాతమేదియులేదు. నేను సమరములో నభిజ్ఞుడను; సంకటములో ధీరుడను. దేవచరిత్ర, కాకచరిత్ర నాకు గరతలామలకములు. కాని స్త్రీజాతిరహస్యము నాకేమి తెలియును? ఈ యద్భుత ప్రాణులకు మీసములు మృగ్యము; శ్మశ్రువులు శూన్యము; బలము పూజ్యము; బుద్ధిపూర్ణము. అయినను వీరు శిశువులకు స్తన్యపానమిచ్చెదరు: ఇది మనవలన గాదు: వీ రకారణముగ నవ్వెదరు; అకారణముగ నేడ్చెదరు. తుచ్ఛముక్తాప్రవాళములు వీరికి బ్రియములు. సంతాన పాలనము, నిరర్థకవస్తు సంగ్రహణము

వీరికి ఏకమాత్ర కార్యములు. ఈదృశి కోమ లాంగి, మసృణవదన, పయస్విని, శిశుపాలిని యగు భార్యతో నే నెటుల వ్యవహరింపవలెను? ఆమె నాకు బ్రియకార్యము లొనరించిన మస్త కమున నిడికొని సమాదరము సేయవలయునా? లేక నా కబాధ్యయైన చపేటాఘాతాముతో వినీ తను జేయవలయునా? వానర ధర్మశాసనమున ఏవంవిధశాసనవిధాన మున్న మాట సత్యము. కాని మానవధర్మశాస్త్ర మేమని చెప్పుచున్నది."

హనుమ యీవిధంబుగ చింతన సేయు చున్న సమయమున నా పర్ణ గృహద్వారమున ఒక సుందరయువకుడు బ్రత్యక్షమయ్యెను. వాని వేషభూషలు బహుమూల్యములు; స్కంద మున లంబితశరాసనము; పృష్ఠమున దూణీ రము; ఒక హస్తమున బాణవిద్ధములగు పది తిత్తిరిపక్షులు; అపరహస్తమున సద్యఃప్రాప్త మధుచక్రము. ఆగంతుకుడు హనుమంతుని జూచి క్రోధముచే నున్మత్తుడై "ఒరే! వాన రాధమా! నీ వేసాహసమున నా రాజవేష మప హరించి నాశయ్యపై బవళించితివి? ఆగుము, నిన్నిపుడే యమాలయమున కనిపెదను" అనెను.

హనుమంతు డనెను: "ఓహో, వీరపుంగవ! శాంతింపుము. హఠము మూర్ఖుల లక్షణము. ధీరులు వెనుకముందు లాలోచించి కార్యము నకు గడంగెదరు. నేను రామదాసహనుమంతు డను. లోకులు నన్ను మహావీరుడందురు. అంతకన్న పరిచయ మనావశ్యకము."

అంతట నాగంతుకుడు సంభ్రమముతో గరములు మోడ్చి "ఆహా, నా యదృష్ట మేమని చెప్పను! శ్రీ హనుమంతుని దర్శన భాగ్యము లభించినది! మహావీర, అజ్ఞానకృత మగు మదీయాపరాధమును క్షమింపుము. నేను తుంబదేశమున కధిపతిని; పేరు చంచరీకుడు. తమ కుచితసత్కారముల సేయుటకు దగిన సాధనసామగ్రి యీ యరణ్యకుటీరమున లేదు. మీ పాదధూళిచే మా రాజపురిని బవిత్రము చేసిన నేను కరము సంతసించెదను. ఓ అంజనీనందన! తమ రెందుల కారమణీయ పరిచ్ఛేదోష్ణీషాదులు తీసివేయుచున్నారు? అవి యున్న సాక్షాత్తు కందర్పుని కరణి గానుపించుచున్నారు. ఇదిగో, నేను రజతమయ దర్పణము జూపుచున్నాను. ఒక పర్యాయ మవలోకిం పుడు. తమ రనుమతించిన ఈ తిత్తిరి పక్షులమాంస మగ్నిపక్వము సేసి యిచ్చె దను. తమరు నిరామిషులు గదా? అయిన నీ యామ్ర పనసరంభాదిఫలములచే మీ క్షున్నివృత్తి జేసికొనుడు. మారుతీ! తమరు విముఖులు కావలదు, ఒక్కమారు ముఖ వ్యాదానము సేయుడు. నే నీ మధుచక్రమును తమ నోట బిండెదను... బహుశః తమరు సంగీత చర్చ జేసి యుండ వచ్చును. అందువలననే వీణ కీగతి పట్టినది. మహావీర! తమ రిది కార్ముకమనుకొని టంకా రము చేసితిరా?" యనెను.



హను—"చంచరీక! నీ యభ్యర్థనకు గరము సంతసించితిని. కాని నీ వధికవాచాలత్వము జూపవలదు. నా యీ వజ్రముష్టివంక జూడుము. ఇది హఠాత్తుగ ధావనముసేయుచుండును. ఈ పరిచ్ఛేదము నా కననుకూలమై బాధించుచున్న యది. వీనిని నీవే ధరింపుము. నా భోజనము కొఱకు నీవు వ్యాకులపడవలదు; యథాసమయ మున కది యగును. నీ వీణ కొఱగానిది; నేను దీనికి నారతంతువులు బిగించెదను. కాని నేనొ కటి జిజ్ఞాసచేయుచున్నాను—నీ వీ విజనారణ్య మున నెందుల కీ కుటీరము నిర్మించుకొంటివి? నీవు నరపతివైనచో గజ వాజ సైన్యదళములు కానుపింపవేమి? నీ రథసారథి యేడి? విదూష కుడు కూడ గానుపింపడే!"

చంచ—"ఓ వానరర్షభ! నేను మనోదుఃఖ ముచే నేకాకిగ వాసముచేయు చుంటిని. ఇపుడు నేనే నాకు రక్షకుడను: సారథిని; విదూషకు డను. నా కథ కరము కరుణాకరము. అవధరిం పుము: నాపట్టమహిషి పరమరూపవతి; అశేష గుణశాలిని. కాని యామెను బతివ్రతయను టకు వీలులేదు. ఒకనాటికాలమున, అతిలావణ్య వతియగు నామెసఖితో నేను గొంచెము సరస మాడుచు దురదృష్టవశమున నామెకంట బడి తిని. ఈతుచ్ఛ కారణమునకే యామె వాక్యా లాపము మానివేసి క్రోధాగారమున వసింప నారంభించెను. ఆమెకు గుణపాఠము నేర్ప దలచి నేనును ఈ యరణ్యమున వాసముచేయు చున్నాను. పశుపక్షులను జంపి విరహబాధ ఉపశమింప చేసికొనుచున్నాను. పవననందన! ఏకపత్ని యనేకానర్థములకు మూలమని నాకు నిశ్చితాభిప్రాయము కలిగినది. శాస్త్రములు యథా ర్థమే చెప్పుచున్నవి: "అల్పములో సుఖము లేదు. అధికములో సుఖమున్నది" అని. ఈ యరణ్యమున మహాతపస్వి లోమశమహర్షి వాసముచేయుచున్నాడని వినియుంటిని. నారీ జాతిని వశపఱచుకొను నుపాయములు వారికి బూర్తిగా నవగతమట. కారణము, వారికి నూర్గురుపత్నులు. వారిని గురువుగా జేసికొన వలయునని నేను నిశ్చయించుకొంటిని. ఇపుడు నాకథ సమస్తము మీకు వినిపించితిని; ఇక, అయోధ్యను వదలి మీ రిచ్చటికి వచ్చినకార్యము

వినవలయునని నా యిచ్ఛ. పూర్వోపకారములను విస్మరించి రామచంద్రుడు మిమ్ముల ననాదరించెనా?''

హను—''సావధానము. నీవు రామనింద చేయవలదు. నే నిపుడు కిష్కింధకు బోవుచుంటిని. అచట దారపరిగ్రహణముసేసి వధూసహితముగ నయోధ్యకు మరలివచ్చెదను. నీ మీద నాకెందుననో ప్రీతిజనించినది. నా మనస్సులోని కథ నీకు దాచక చెప్పెదను, వినుము: చంచరీక! నాకు స్త్రీతత్వ మవగతముకాదు. కేవలము పితౄణ పరిశోధనార్థమే నే నీ సంకల్పముచేసితిని. నీ దాంపత్యకథ వినినప్పటి నుండి నా చిత్తము సంశయాకులమైనది.

చంచరీకుడు మందహాసముతో నిటులనెను: ''హనుమ! భయములేదు. గంధమాదనమును మోయగలిగిన నీవు భార్యభారమును మోయుట యేమివింత? నేను నీకు సమస్తము నేర్పెదను. ప్రస్తుతము కొంచెము సారగర్భమగు నుపదేశ మొసంగెదను. అవధరింపుము: పుత్రార్థము భార్యను గొనివచ్చుట యతిసహజకార్యము. కాని, ప్రేమకొఱకై భార్యను గ్రహింపదలచిన స్త్రీచరిత్రాభిజ్ఞత మనవసరము. నిజస్త్రీ సలజ్జ. పరస్త్రీ నిర్లజ్జగా నుండవలయునని రసజ్ఞుల కాంక్ష. మీ రామరాజ్యములోని విషయములు నా కవగతములు కావు. కాని, ప్రపంచమున నిటువంటి శుభసమన్వయమఱుదుగ గానుపించును, కాన—''

హను—''ఓయి చంచరీక! నీవు ఓరిమి వహించి ముందు నిజసమస్యను పరిష్కరించుకొనుము—పిమ్మట నా కుపదేశించవచ్చును. ప్రొద్దు క్రుంకినది; ఇక భోజనమున కాయోజనము చేయవచ్చును. నే నిపుడు వనభూమియందలి శీతవాయువులను సహింప లేకున్నాను—కుటీరద్వారమును బంధింపుము.''

చంచరీకుడు కవాటము బంధించి, ప్రదీపమును జ్వలింపజేసి భోజనమున కుద్యోగము చేయ నారంభించెను. ఇంతలో, ఆతురతతో ద్వారమున గరాఘాతముసేయుచు నెవ్వరో పిలిచిరి: ''భో గృహస్థ! కవాటము తెరువుము. నేను శీతార్త. క్షుధాపీడిత, అతిథిని.''

చంచరీకుడు ద్వారోద్ఘాటనము సేసినమీదట నొక శీర్ణకాయ తపస్వి గృహమున బ్రవేశించెను. వారి మస్తకము జటామండితము; శ్మశ్రువు లాజానులంబితములు; దేహము రోమాచ్ఛాదితము.

చంచరీకుడు ప్రణామముసేసి ''తపోధనా! స్వనామధన్యులైన లోమశ మహర్షులు తమరే నని చూడగనే గుర్తించితిని. తమ దర్శనలాభము కొఱకు వ్యగ్రుడనై యున్నాను. ఒకవేళ, తమరిది యోగబలమున గ్రహించి కృపావశమున స్వయముగా విచ్చేసియుండవచ్చును. నేను తుంబరాజ చంచరీకుడను. ఇతడు నా పరమమిత్రుడు జగద్విఖ్యాత మహావీరుడు హనుమంతుడు. ఈ కపిప్రవరుడు దారపరిగ్రహణార్థము కిష్కింధకు బోవుచుండెను. కాని, వీరిచిత్తము హఠాత్తుగ సంశయాకులమైనది. నా యవస్థకూడ బాగుగలేదు. నాకొక భార్య యున్నమాట సత్యము; కాని నేను వైచిత్ర్య పిపాసిని. అనేకము నాస్వాదించు వాసన నాలో బలవత్తరమైనది. ఋషిశ్రేష్ఠ! దాంపత్యతత్వమున దమ కున్న జ్ఞాన మపారమని నేను వినియుంటిని. ఈ పక్షిమాంసమును దమకై శూల్యపక్వము గావింపుచున్నాను. తమరంతదనుక కొంచెము సత్పరామర్శ యిచ్చెదరుగాక యని మనవి'' యనెను.

ఈలోపల మహర్షి లోమశు డొక పెద్దపనస ఫలమును క్రోడమున నిడికొని దానితొనలను త్వరగ నోట గ్రుక్కుకొనుచుండెను. భుజించుట సమాప్తిచేసి యిటులనెను:

''పవననందనా, చిరంజీవివి గమ్ము! తుంబరాజా! నీకు జయమగుగాక! ఇపుడు నేను కొంచెము స్వస్థత జెందితిని. ఎనిమిది దినముల నుండి నా కాహార నిద్రలు లేవు. నేను గృహచ్యుతుడను. కౌపీనమే నా సర్వస్వము.''

వింట నారి సంధించి చంచరీకు డనెను: ''ప్రభూ! ఏ దురాచారి, రాక్షసుడు తమయాశ్రమము కొల్లగొట్టెను? అనుమతిండు—నే నీక్షణముననే వానిని వధించెదను. అయ్యో, తమ పత్ను లందరు నపహరింపబడిరా? మహావీర! స్తబ్ధుడవై యేమి యాలోచించుచున్నావు? గాత్రోత్థానము సేయుము; మరల నీవు సాగరము లఘించవలసియుండును. విభీషణుని వదలి మీరు మంచిపని చేయలేదు.''

లోమశ:—''మీరు వ్యగ్రులు కావలదు. నా యితిహాసము వినుడు. పూర్వము దక్షిణాపథమున ద్వాదశవర్షము లనావృష్టి దూషితములు. దానికి బ్రతికారము సేయుటకు నూర్గురు నరపతులు నా శరణుజొచ్చిరి. వారి రాజ్యహితార్థము నే నొక గొప్పయజ్ఞ మనుష్ఠించి సువృష్టిని గలిగించితిని. కృతజ్ఞులగు నరపతులు దక్షిణారూపముగ దమ నూర్గురు కన్యలను నాకు దానమొసగి, వారి భరణపోషణకు దగునేర్పాటులు గావించిరి. నే నీ రాజకుమారికలకు నా తపోవనముననే నూరు గృహములను నిర్మించితిని.''

చంచరీ—''మునివరా! తమ తపోవనమున క్రోధాగార మున్నదా?''

లోమశ—''ప్రత్యేక గృహ మొక క్రోధాగారము. అభాగినులు నిరంతరము గలహించుచుందురు. వారికి గృహకార్యములు శూన్యము; పతిసేవపూజ్యము; పూజావ్రతములు మృగ్యము. నే నాదరముతో వారికి బ్రథమ, ద్వితీయ—యిత్యాదిక్రమమున నవనవతితమ, శతతమ యని పేర్లిడితిని. కాని వారు పరస్పరము మూషిక, చర్మచటిక, పేచక, చుచుందరిప్రభృతి నీచనామములతోసంబోధించుకొనుచు,నన్నును భల్లూక మందురు. నేను విసుగెత్తి పాఱివచ్చితిని. ఇక నీ వ్యాపికాగణ మిచ్చవచ్చినటుల గలహింపవచ్చును. ఓరాజా! నీ కనేకమాస్వాదించవలయు ననెడి కోరికయున్నదా? అయిన నా యాశ్రమమునకు బొమ్ము. శ్రీ హనుమంతుడు గూడ నచ్చటనే పత్ని నేరుకొనవచ్చును. నే నిక నచ్చటకు బోను. నా కీ వృద్ధాప్యమున శాంతి గావలయును. ఇంకొక వివాహము సేసికొని యేకపత్నిలోనున్న సుఖమును బొందవలయునని నాయిచ్ఛ.''

లోమశమహర్షి మాటలు విని హనుమంతుడు కొలదికాలము స్తబ్ధుడాయెను. పిమ్మట ప్రకృతిస్థుడై ''తపోధనా, ప్రణిపాతము: చంచరీక, నీ మనోవాంఛ సిద్ధించుగాక! నేను సుగ్రీ




వునియొద్దకు బోవుచున్నాను సెలవు?"— అనియెను.

చంచరీకుడు చంచలుడై "అది యెటుల? ఈ గభీరరాత్రియం దరణ్య పథమున నెటుల బోయెదవు? కనీసము ప్రభాత పర్యంత ముండుము" అని బ్రతిమాలెను.

హనుమంతుడు చెవి నిడలేదు.

* * *

కిష్కింధలో నొక రమ్యమగు నుపవనమున,నలనీలగయగవాక్షాది మిత్రులసమేతముగ వానరరాజు సుగ్రీవుడు కొలువుండి, నారికేళములు భక్షించుచున్న సమయమున హనుమంతుడు వచ్చి వారి కభివాదముచేసెను. సుగ్రీవుడు రాజోచిత గాంభీర్యముతో నిటు లనెను:

"మహావీర, ఏమిపని? నేనిపుడు రాజకార్యములలో వ్యగ్రుడనై యున్నాను. తీరికలేదు. తీరికగ నున్నపుడు నీ వక్తవ్యము విందును."

హను—"వానరాధిప! నే నొకవిశేష ప్రయోజన ముండియే నీ సహాయమర్థింప వచ్చితిని."

సుగ్రీవు—"కిష్కింధలో నీవున్న వనసంపత్తి యంతయు చిరంజీవి యంగదుడు భుక్తపఱచుకొనెను. తిరిగి వచ్చు నాశగూడ లేదు. నేనుగూడ నిపు డత్యంతాభావములో నున్నాను. నీ కేమియు నివ్వజాలను. అయోధ్య నెందులకు వదలితివి? తిరిగి రామచంద్రుని యొద్దకు బోయి నా ప్రార్థనగ దెలుపుము. వారు తప్పక సహాయపడెదరు. రామచంద్రుడు చెడువాడు కాదే!"

హను—"ఓయి సుగ్రీవ! నీకు జింత వలదు. నేను నా పూర్వసంపత్తిని గోరుటలేదు. నీ రాజ్యమున భాగముకూడ కోరను. రామచంద్రప్రభుని కృపచే నా కేలోటును లేదు. నే నిచ్చటకు వివాహము సేసికొనుటకై వచ్చితిని. నా కిది యభ్యాసములేని వ్యవహారముగాన సంశయాన్వితుడనై తిని. నాకు సత్పరామర్శ నిమ్ము."

సుగ్రీవు డంతట ప్రీతుడై యనెను: "సుహృద్వరా: నీ సంకల్పమతిసాధువు. ఇంతకాల మనవసరప్రసంగ మెందులకు జేసితివి? ఈ సుకోమలతరుశాఖపై గూర్చుండి,కొంచెము నారికేళోదకము పానముచేసి స్నిగ్ధుడవు గమ్ము. సోదరా! నేను సర్వదానీమేలునే గోరుచుందును. 'మా హనుమంతు డింకను సంసారికాలే'దని నా కొకటే చింత! నీవు వివాహమునకై లవలేశము చింతింపవలదు. అది యతి సహజ కార్యము. చూడుము. నే నష్టోత్తరసహస్ర భార్యలచే బరివృతుడనై పరమానందమున గాలయాపన చేయుచున్నాను."

హను—"నీ వీ పత్నీపుంజము నెటుల శాసింపుచుంటివి? వారు కలహింపరా? వాక్యబాణములచే నిన్ను బ్రపీడితుని జేయరా?"

సుగ్రీవుడు హాసముతో ననెను: "సాధ్యమా! నేను గదళీవల్కలములతో వారి యోష్ఠాధరములు బంధించి యుంచెదను; ప్రేమాలాప సమయమున మాత్రమే విప్పెదను. ఏమైనను గానిమ్ము. నీకు భయములేదు. ప్రస్తుతము, నీ వొక పత్నిని మాత్రము గ్రహింపుము. పిమ్మట సంఖ్యను బెంచవచ్చును. అసలు నీవిచ్చటను బ్రయత్నింపక శ్రీమతి తారను వివాహము చేసికొమ్మని నా సలహా. ఇపుడు నా కామెతో నంతగా బ్రయోజనములేదు. ఆమె ప్రౌఢ; పతిసేవలో పరిపక్వ. ఆమెతో నీవు తప్పక సుఖపడెదవు."

హను—"నీవు తారాదేవినామము తలపవలదు. ఆమె నాకు బూజ్య."

సుగ్రీ—"అటులనా! అయోధ్యలో నుండుటచే నీమతి పాడయిపోయినట్లుగ దోచుచున్నది. మంచిది, నీ వింకొక ప్రయత్నము సేయవచ్చును. ఈ కిష్కింధకు దక్షిణమున 'కిచ్చట' దేశ మున్నది. దాని యధిపతి ప్లవంగము రాజపుత్రావస్థలో లోకాంతరగమనము చేసెను. ఇపు డతని దుహిత చిలింప రాజ్యమును శాసించుచున్నది. ఆ వానరి యతిశయలావణ్యవతి; విదుషి; చతుర. నే నొక దూతచే వివాహసందేశము పంపితిని. కాని చిలింప వాని వాలము కత్తిరించి త్రిప్పిపంపినది. నల నీల గయ గవాక్షాది ప్రముఖులుకూడ నామె వద్దకు వెళ్ళి దమతమ ప్రేమను నివేదించిరి. కాని, ఎవ్వరును బూర్తితోకతో తిరిగిరాలేదు. ఆ దుర్వినీతవానరిపై నాకు క్రోధము, లోభము రెండును నున్నవి. ఏమిసేయను? నాకు దీరికలేదు. ఉన్న, దండయాత్రచేసి యామె నిదివరకే పట్టితెచ్చెడివాడను. ఇపుడామెను నీవు జయించిన నాక్షోభ దూరమగును; నీకు బత్నియు లభ్యమగును."

హనుమంతుడు కొన్నిక్షణము లాలోచించి, "అటులనే. నే నిపుడే కిచ్చట దేశమునకు బ్రయాణ మగుచున్నాను" యనెను.

* * *

హనుమంతుడు కిచ్చట రాజ్యమునం దుపస్థితుడాయెను, వారి విపుల శరీరము గాంచి ప్రజలు భీతిచే మార్గము వదలి దూరముగ నిలువబడిరి. చారు లీసంవాదమును చిలింపకు దెలిపిరి:

"రాజనందినీ! ఇక గుశలము లేదు. పర్వతాకారముతో వీరవానరు డొకడు నీరాజ్యమును ముట్టడించెను."

"ఇటువంటి వీరుల ననేకమందిని జూచితిని. వానిని సత్వరము బిలుచుకొనిరం"డని చిలింప యాజ్ఞాపించెను. హనుమంతు డొక మనోహరమైన కుంజవనమునకు గొనిపోబడెను. చిలింప యచట సఖియలచే బరివృతయై గూర్చుండియుండెను. ఆమె చెవులకు రక్తప్రవాళములు; కంఠమున గపర్దమాల; హస్తమున లీలాకదళి.

హనుమంతుడు ముగ్ధుడై యిటుల తలచెను: "అయ్యారే! సుగ్రీవుడు యథార్థమే దెలిపెను. ఈ తరుణవానరి పరమసుందరి. ఈమెను జూచిన మాత్రమున నా చిత్తము చంచలమైనది; సంశయము దూరమైనది. ఈమె లభింపనిచో నా జీవితము వ్యర్థము."

మందహాసముతో గుందదంతములు వికసింపజేసి చిలింప యిటులనెను: "వీరవరా! నీవే హేతువుచే నా యనుమతి లేక నా రాజ్యమున బ్రవేశించితివి? నీ వెవరవు? ఎచటనుండి వచ్చితివి? ఏమి కావలయును? నేను నీ కభయ మిచ్చుచుంటిని, సమస్తము వెల్లడింపుము."

"ఓప్లవంగమనందినీ! నేను రామదాస హనుమంతుడను. అయోధ్య నుండి వచ్చితిని. నీ పాణిగ్రహణముచేసి తిరిగి యయోధ్యకు బోవలయునని నా కోరిక. నేనును నీ కభయ మిచ్చుచున్నాను."

హనుమంతుని మాటలు విని సఖులు కిలకిల నవ్విరి. చిలింప యడిగెను: "హనుమ! నీ ధృష్టతకు మేరలేదే! నా పాణి నర్థించుటకు దగినగుణము నీలో నే మున్నది?"

హను—"దూర్వాదళ శ్యాముడు, పద్మపలాశలోచనుడు, సర్వసద్గుణ సమన్వితుడు, లోకోత్తరచరితుడు, పితృవాక్యపాలనాత్యక్తసుఖి యగు శ్రీరామచంద్రుల బంటును."

చిలింప—"రామదాసా! నీవు రామచంద్రునితో సంబంధము కూర్చుటకు వచ్చితివా?"

హనుమంతుడు నాలుక కఱచుకొని "నా ప్రభు వేకపత్నీవ్రతుడు. లోకాతిశయ సౌందర్యవతి జనకతనయ సీత వారిభార్య. నేను నా కొరకై నీ వద్దకు వచ్చితిని," అనెను.

చిలింప—"అటులయిన నీ విషయము చెప్పుము."

హను—"ఎవరికీర్తి వారు పొగడుకొనుట ధర్మవిరుద్ధము, కాని, శత్రు సమక్షమునను, ప్రియురాండ్ర యెదుటను దనగొప్పను జెప్పుకొనుటలో దోసగులేదని పండితుల నోట వినియుంటిని. కాన చెప్పుచుంటిని, వినుము: నేను సాగరము లంఘించితిని; గంధమాదనము పెకలించితిని; సూర్యభగవానుని జంక నిడుకొంటిని—ఇదిగో, గమలినమచ్చ!—శతలక్ష రాక్షసులను వధించితిని; రావణుని జపేటాఘాతముచే గౌరవించితిని; వాని రథకెక్కెము కొఱికితిని—ఇదిగో చూడుము, ఒక దంత మూడినది!"

చిలింప—"మహావీర: నీ వచనము వినినమీదట నాకు బరమప్రీతి జనించినది. స్త్రీజాతి కేవలము వీరత్వమునే గోరదు. నీలో గాంతున కుండవలసిన గుణము లేమియున్నవి? నీకు నృత్యగీతములు దెలియునా? కావ్యములు రచింపగలవా?"

హను—"ఓ చిలింప! రావణవధానంతరము నే నానందముచే బరవశుడనై యొకమాటు నృత్యగీతముల కుపక్రమించితిని. కాని, నల నీల ప్రభృతి వానరగణము న న్నపహాసము సేయుటచే నేను విముఖుడనైతిని. సుమిత్రానందను డపుడు నాతో "మారుతీ! నీవు కపితుడవు కావలదు. నీవు చేసినదే నృత్యము; పాడినదే గీతము; చెప్పినదే కావ్యము. ఇది గ్రహించు శక్తి పామరులకు లే" దనియెను.

చిలింప కరధృతకదళీగుచ్ఛమును విలాసముగ దంశనముసేయుచు నిట్లనెను: "పవననందన! నీవు ప్రేమతత్వ మెంతవర కెఱుగుదువు? నీ వే జాతినాయకుడవు? ధీరోదాత్తుడవా, ధీరోద్ధతుడవా? ప్రశాంతుడవా లేక లలితుడవా? నీ వేరీతిగ నా మనోరంజనము చేయుదువు? ఏ విధముగ నన్ను లాలించెదవు? నేను గజముక్తాహారము కావలయునని కోఱిన నీ వెచట నుండి తేగలవు? నేను కుపితనై యాహారము ముట్టనిచో నీ వేమి చేసెదవు?"

హనుమంతు డాలోచనలో బడెను; "ఈ విదగ్ధవానరి నన్ను జిక్కులలో బడవైచినది. ఈ ప్రశ్నల కేమి జవాబివ్వగలను? ఏమయినం గానిమ్ము, నేనుమాత్ర మప్రతిభుడనుగాను." ఇటుల నిశ్చయించుకొని ప్రకాశముగ ననెను:

"సుందరీ! నిన్నుజూచి నా చిత్తము చంచలమైనది. ప్రేమ తత్వమున నా కిదే ప్రథమ పరిచయము. అయినను జింతవలదు. కిష్కింధాధిపతి సుగ్రీవుడు నా కగ్రజతుల్యుడు. అతడు నాకంతయు నేర్పగలడు. తుంబురాజను చంచరీకుడు నాకు పరమమిత్రుడు. అతడుకూడ నాకు జ్ఞానదానము సేయగలడు. నీవు గజముక్తాహారము కోరిన నేను జానకీదేవి నడిగి తెచ్చి యిచ్చెదను. నీవు భుజించనిచో నే నీ కఠినాంగుళులచే దినిపింపగలను. ప్రియా! ఇక జాగు సేయక నావెంట రమ్ము. సీతాదేవి నీకు హనుమతి యని పేరిడినది. ఆమె నీకొఱ కయోధ్యలో బ్రతీక్షించు చుండవచ్చును."

చిలింప యపుడు హనుమంతుని చిబుకమున తర్జనితో మృదువుగ జఱచుచు నిట్లనెను: "ఒరే బర్బర! ఓయి అబోధ! ఓ వృద్ధబాలక! ప్రేమను గుఱించి నీకేమియు దెలియదు. పొమ్ము, కిష్కింధకు బోయి సుగ్రీవుని బంపుము."

"ఓకఠినురాలా! నాకాశగొలిపి, నిరాశ నెందులకు జేయుచుంటివి? నిన్ను నే నేమాత్రమును వదలను"—హనుమంతుడు కోపముతో నీ రెండు మాట లని చిలింపను బట్టుకొనుటకు బాహువులు ప్రసరింపజేసెను.

చిలింప కరతాళసహకారమునవికటహాసము చేసెను. ఆకస్మికముగ, వనాంతరాళమునుండి కాలాంతకయమునిబోలు మహాకాయనరకపు లిద్దరు నిశ్శబ్దముగ వచ్చి, ప్రమత్తుడుగనున్న హనుమంతుని పాశబద్ధుని జేసిరి. చిలింప యిటు లాజ్ఞాపించెను: "ఓ అరంగా, అటంగా! ఈ మర్కటమునకు దర్ప మధికముగ నున్నది. పంద్రెం డంగుళముల పరిమితి గత్తిరించి వెడలగొట్టుడు."

అంతట ప్రత్యుత్పన్నమతి హనుమంతుడు ప్రభంజనుని స్మరించెను. నిమేషమధ్యమున వారి శరీరము హిమాద్రి సదృశమాయెను. పాశము తుత్తునియ లయ్యెను. ప్రచండ పదాఘాతముచే నరకపిద్వయము సాగర గర్భమున నిక్షిప్తమైరి. స్వర్గమర్త్య పాతాళములను బ్రకంపింపజేయుచు 'ఊఫ్, ఊఫ్' అను రవమున మహావీరుడు ముమ్మారు సింహనాదముచేసి,



చిలింప కేశములను గ్రహించి 'జయ్ సీతారామ్' అని ఘోషించుచు నూర్ధ్వదిశ కెగిరెను.

ఝంఝూవాతాహత మేఘ న్యాయమున హనుమంతుడు శూన్యమార్గమున ధావితు డగుచుండెను. సిద్ధ, గంధర్వ, విధ్యాధరులు మొదలగు నాకాశవిహారులు వచ్చి "పవనాత్మజ! నేటికి నీకౌమారదశ తొలగినది. సుఖివి గమ్మని యాశీర్వదించుచున్నా" మనిరి. దిగ్వధువులు పరుగిడివచ్చి—"అంజనీ నందన! క్షణకాలము నీ గమనము నుపసంహరింపుము. మేము వధువు ముఖము చూచెదము," అనిరి.

హనుమంతుడు హుంకరించెను. గగనచారులు భయముచే మేఘముల మాటున దాగిరి. దిగ్వధువులు దిక్కులు మఱచి పాఱిరి. చిలింప కాతర కంఠముతో నిట్లనెను:

"మహావీర! నా కేశములను వదలుము. చాల బాధగనున్నది. నన్ను పృష్ఠమున నిడికొనుట శ్రేష్ఠము; లేదా వక్షమున కంటించుకొనుము."

హనుమంతుడు హుంకరించెను.

చిలింప—"ప్రాణవల్లభ! నేను కేవలము నీదాననే! ఓ అరసిక! నీవు పరిహాసమును కూడ గ్రహింప జాలవా? నేను నిన్నుదక్క యితరుల నెఱుగను!"

హనుమంతుడు తిరిగి హుంకరించెను.

* * *

క్రింద కిష్కింధ గానుపించుచున్నది. సుగ్రీవుడు స్వల్పతోయ తుంగభద్రానదీ గర్భమున నష్టాధిక సహస్రపత్నులతో జలక్రీడ సలుపుచుండెను.

హనుమంతుడు గుప్పిటవదిలెను. పొలివోని గుఱి. వానరి గిరగిర దిరుగుచు సుగ్రీవుని మూపున బతితురా లయ్యెను.

భారవిముక్తుడై హనుమంతుడు ద్విగుణ వేగముతో ధావితు డాయెను. పంచవటి—జన్మస్థానము — చిత్రకూటము — శృంగిబేరము ప్రయాగ—తుద కయోధ్య.

* * *

సీతాదేవి విస్మయముతో హనుమంతుని నడిగెను:

"వత్సా! ముందుగ సంవాదము దెలుపకనే వచ్చితివేమి? నేను నగరి నలంకరింప జేయించెడుదానను గదా. వాద్యభండారములను గూడ సమకూర్చి యుంచెడు దానను గదా. మరి హనుమతి యేది?"

హనుమంతుడు నతమస్తకుడై "మాతా, హనుమతి లభింపలేదు. నే నొక సామాన్య వానరిని హరించితినిగాని దానిని కూడా సుగ్రీవునకే దానము చేసితిని. ఓ దేవి! విధాత నాకిచ్చిన ఈ విశాలవక్షమందలి క్షుద్రహృదయమున మీరును, శ్రీరామచంద్రులును బరిపూర్ణముగ విరాజిల్లుచున్నారు. దారపుత్రాదుల కందు జోటులేదు," అనెను.

సీత—"మరి పితౄణ మెటుల దీర్చెదవు?"

హనుమంతుడు మస్తకమున గరాఘాతము చేసి 'ఓరి పాషండా! నీవావిషయమునే మఱచిపోతివి గదా!' యనుకొని, తదుపరి సీతాదేవిని, "జననీ! నే నమరుడనై చిరకాలము పితరులకు బిండోదకము లిచ్చునటుల వర మనుగ్రహింపుము," అని వేడెను.

సీత—"తథాస్తు!" అనెను.

అపుడు హనుమంతుడు పరితుష్టుడై, విశాల వక్షమును బ్రసరింపజేసి భుజద్వయ మూర్ధ్వమునకెత్తి "జయ్ సీతారామ్!" అని మేఘగర్జన చేసెను.

